సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం ; 28 ; అక్టోబర్ ; 2023



సోమశిలలో 30.234 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 30.234 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 136 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) -	రూ.62,920
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,680
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,850
నవర (8 గ్రా) -	రూ.46,800

గరిష్టం/కనిష్టం
35.9 /26.0

వాతావరణం

శుక్రవారం గాలిలో తేమ 65 శాతం ఉంది. శనివారం ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు పాక్షిక చంద్రగ్రహణం

• ఆలయాల మూత

నెల్లూరు(బృందావనం): శనివారం రాత్రి పాక్షిక చంద్రగ్రహణం కారణంగా నగరంలోని రంగనాయకులపేట, మూలాపేట తదితర ప్రాంతాల్లో ఉన్న శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి ఆలయం, శ్రీభువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంతో పాటు పలు దేవస్థానాలను సాయంత్రం 5 నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు మూసివేస్తున్నట్లు ఆయా ఆలయాల నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. శాస్త్రోక్తంగా సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమం నిర్వహించిన అనంతరం స్వామివార్ల పునర్దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు పెంచలకోన ఆలయాల మూసివేత



రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామి ఆలయాలను పాక్షిక చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం 5 నుంచి ఆదివారం ఉదయం 7 గంటల వరకు మూసివేయనున్నట్లు ఆలయ ఈఓ జనార్దన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, నిత్య కైంకర్యాల అనంతరం ఉదయం 8 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. ఈ అంశాన్ని భక్తులు గమనించాలని పేర్కొన్నారు.

అందుబాటులో టీటీడీ క్యాలెండర్లు, డైరీలు

నెల్లూరు(బృందావనం): తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించి 2024 సంవత్సరం క్యాలెండర్లు, డైరీలు నగరంలోని రాంనగర్ శబరి శ్రీరామక్షేత్రం వద్ద ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో విక్రయిస్తున్నట్లు ఆ కల్యాణ మండపం మేనేజర్ బి.విజయనిర్మల శుక్రవారం తెలిపారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల చిత్రాలను ముద్రించిన 12 పేజీల క్యాలెండర్ రూ.130, స్వామివారి చిత్రాలతో రూపొందించిన డీలక్స్ డైరీ రూ.150, తెలుగు పంచాంగం రూ.30, వేంకటేశ్వరస్వామి వారి చిత్రంతో తీర్చిదిద్దిన క్యాలెండర్ రూ.20, వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి చిత్రంతో ఉన్న క్యాలెండర్ రూ.15లకు విక్రయిస్తున్నట్లు ఆమె తెలిపారు. భక్తులు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు రాంనగర్‌లోని టీటీడీ కల్యాణ మండపం వద్దకు వచ్చి కొనుగోలు చేయవచ్చని తెలిపారు. కాగా 12 పేజీల క్యాలెండర్లు, డైరీలు 5 వేల చొప్పున, సాధారణ క్యాలెండర్లు ఒక్కొక్కటి 1000 చొప్పున 3 వేలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

ఇంటర్ యూనివర్సిటీ ఫెన్సింగ్ జట్ల ఎంపికలు



ఎంపికైన జట్లతో కళాశాల ప్రతినిధులు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ యూనివర్సిటీ ఫెన్సింగ్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు అనంతపురం జేఎన్‌టీయూ పరిధిలోని కళాశాలల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి ఫెన్సింగ్ పోటీలు నిర్వహించి ఫాయిల్, యప్పీ, సాబర్ విభాగాల్లో జట్లను ఎంపిక చేశారు. మూడు విభాగాల్లోనూ వెంకటేశ్వర కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు త్వరలో జరగనున్న ఇంటర్ యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటాయని కళాశాల ప్రిన్సిపల్ వి.అనిల్‌కుమార్, చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ తెలిపారు. జేఎన్‌టీయూ స్పోర్ట్స్ సెక్రటరీ బి.జ్యోతిరెడ్డి ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఫిజికల్ డైరెక్టర్లు పి.రాజేష్, రాహుల్, ఆర్.ప్రసాద్, సతీష్, యాసిన్ ఈ పోటీలు నిర్వహించారు.

నేటి నుంచి టెన్త్ పరీక్షల ఫీజు చెల్లింపు

నెల్లూరు రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పదో తరగతి చదివే విద్యార్థులు శనివారం నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫీజును ఆన్‌లైన్‌లో పాఠశాలల లాగిన్ ద్వారా చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణను ఖరారు చేసిందని, అందుకు అనుగుణంగా ఫీజుల చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు నవంబర్ 10వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని, అపరాధ రుసుంతో నవంబర్ 30వ తేదీ లోపు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు.

ఉదయ 'గిరి'..
వనమూలికల సిరి

- దుర్గంపై 162 ఆయుర్వేద మొక్కల గుర్తింపు
- బ్రిటిష్ కాలం నుంచి ఆయుర్వేద సంపదపై దృష్టి
- ఆయుర్వేద కళాశాల, వైద్యశాల ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్

రూపంలో శేషాచలం కొండలను పోలి ఉండే ఉదయగిరి దుర్గం ఆయుర్వేద వనమూలికలకు నిలయం. అపార ఆయుర్వేద సంపదకు నెలవైన ఈ దుర్గం ఎంతో ప్రాశస్త్యం పొందినది. నల్లమల, వెలిగొండ, శ్రీశైలం అడవుల్లో లభించని అరుదైన అనేక రకాల ఔషధ మొక్కలు ఈ దుర్గంపై ఉన్నట్లు ఆయుర్వేద పరిశోధకులు గుర్తించారు. ఈ వనమూలికలు ఆయుర్వేద వైద్యానికి ఎంతో ఉపయోగపడతాయని వైద్యులు చెబుతున్నారు.



వనమూలికలు, ఔషధ మొక్కలకు నిలయమైన ఉదయగిరి దుర్గం

ఉదయగిరి: సముద్ర మట్టానికి 938 మీటర్ల ఎత్తులో గల ఉదయగిరి దుర్గం సంజీవకొండగా ప్రసిద్ధి పొందినదని స్థానికులు చెబుతుంటారు. ఈ దుర్గంపై ఆయుర్వేద మొక్కలకు కొదువలేదు. ప్రాచీన వైద్యవిధానాల్లో ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఆయుర్వేద వైద్యంతో ఎన్నో రోగాలు నయమైనట్లు ఆయుర్వేద శాస్త్రం చెబుతోంది. అందుకే రాజుల కాలం నుంచి నేటి ఆధునిక కాలం వరకు వైద్యులకు కూడా అంతుచిక్కని అనేక రోగాలు ఆయుర్వేద వైద్యం ద్వారా నయమవుతున్నాయి. ఈ వైద్యానికి అవసరమైన ఎంతో విలువైన వనమూలికలు ఉదయగిరి దుర్గంపై ఉన్నప్పటికీ ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఇటీవల ఆయుర్వేద వైద్యంపై ప్రజల్లో ఆసక్తి పెరగడంతో ఈ వైద్యానికి డిమాండ్ ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆయుర్వేద వైద్యానికి ప్రాధాన్యమిస్తూ విలువైన ఆయుర్వేద మందులను తయారు చేస్తూ వైద్యశాలలకు సరఫరా చేస్తోంది. ఆయుర్వేద వైద్యశాలల్లో బెడ్లు కూడా ఏర్పాటు చేసి పసుర్లు, తైలాలతో ప్రాచీన వైద్యసేవలు అందిస్తోంది. దీంతో ఈ వైద్యానికి పూర్వవైభవం తెచ్చేలా అడుగులు పడుతున్నాయి.

పరిశోధనలు

ఆయుర్వేద సంస్థల ప్రతినిధులు 30 ఏళ్ల క్రితమే ఉదయగిరి దుర్గాన్ని సందర్శించి అనేక ఔషధ మొక్కలను సేకరించారు. అనేక వనమూలికా మొక్కలపై పరిశోధనలు చేశారు. కర్ణాటకకు చెందిన ఆయుర్వేద డాక్టర్ అయ్యంగార్, నెల్లూరుకు చెందిన పి.చెంచలరావు పంతులు ఇక్కడి అడవుల్లో మొక్కలు సేకరించి తమ ఆయుర్వేద చికిత్సాలయాల్లో వినియోగించారని తెలుస్తోంది. ఇప్పటికీ స్థానికంగా ఉన్న అనేక మంది ఆయుర్వేద వైద్యులు కొండల్లో లభించే వనమూలికలను వైద్యానికి ఉపయోగిస్తున్నారు.

బ్రిటిష్ కాలంలోనే గుర్తింపు

ఉదయగిరి అడవులు, కొండల్లో ఉండే ఔషధ సంపద బ్రిటిష్ పాలకులే గుర్తించినట్లు ఆధారాలు ఉన్నాయి. ఈ వనమూలికలపై వారు అనేక పరిశోధనలు కూడా జరిపినట్లు తెలుస్తోంది. ఉదయగిరిలో ఒక ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేసి వైద్యసేవలను కూడా అందించారు. మాదాల జానకిరామ్ మంత్రిగా ఉన్న సమయంలో ఆయుర్వేద ఫార్మసీ ఏర్పాటుకు ప్రయత్నం చేసినా కార్యరూపం దాల్చలేదు. అటవీశాఖ ఆధ్వర్యంలో దుర్గంపల్లి పరిసర ప్రాంతాల్లో వనమూలికల మొక్కల సంరక్షణ కోసం కంచె కూడా ఏర్పాటు చేశారు. అయినా ఆశించిన ఫలితం లేదు. ఉదయగిరి దుర్గంలో ఉన్న అపారమైన వనమూలికా సంపదను సక్రమంగా వినియోగించుకోనేందుకు ఉదయగిరిలో ఆయుర్వేద కళాశాల, వైద్యశాల ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అపార సంపద

ఆయుర్వేద వైద్యానికి ఉపయోగించే వనమూలికలు ఉదయగిరి అడవుల్లో, కొండల్లో, దుర్గంపై అపారంగా ఉన్నాయని తెలుస్తోంది. వైఎస్సార్ కడప, ప్రకాశం, శ్రీపొటి శ్రీరాములు నెల్లూరు జిల్లాల సరిహద్దులో ఉన్న ఉదయగిరి, సిద్ధేశ్వరం, భైరవకోన అడవులు, కొండలు, కోనలు, గుట్టల్లో 162 రకాలకు పైగా ఔషధ మొక్కలు ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. ఉదరకోశ వ్యాధులు, పక్షవాతం, కామెర్లు, పైత్యం, పోలియో తదితర వ్యాధులను నయం చేసే వనమూలికలు ఈ ప్రాంతాల్లో దొరుకుతున్నాయి. దీర్ఘకాలిక క్యాన్సర్‌ను సైతం నయం చేసే ఔషధ మొక్కలు ఈ దుర్గంపై ఉన్నట్లు పలువురు పరిశోధకులు పేర్కొన్నారు.

ఆయుర్వేద కళాశాల ఏర్పాటు చేయాలి



ఉదయగిరి అడవుల్లో ఎన్నో రకాల వనమూలికలు ఉన్నాయి. వీటిని భావితరాలకు అందించాలంటే ఉదయగిరిలో ఒక ఆయుర్వేద కళాశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దీని ద్వారా ఎంతో మందికి ప్రయోజనం కలగడంతోపాటు కొంతమందికి ఉపాధి అవకాశాలు కూడా దొరుకుతాయి. తద్వారా ఆయుర్వేద వైద్యానికి పూర్వవైభవం తెచ్చే అవకాశం కలుగుతుంది.

– గాజుల ఫారుఖ్‌అలీ, ఉపాధ్యాయుడు

వనమూలికా సంపదను సంరక్షిస్తున్నాం



ఉదయగిరి దుర్గంపై ఉన్న అపారమైన వనమూలికా సంపదను సంరక్షించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నాం. సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉన్నందున జాగ్రత్తలు తీసుకుంటూ విలువైన సంపదకు హాని జరగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వనమూలికలు అగ్నికి ఆహుతి కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– తమ్మల ఉమామహేశ్వరరెడ్డి, రేంజర్, ఉదయగిరి

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట

• కలెక్టర్ ఎం.హరినారాయణన్



అర్జీదారుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ హరినారాయణన్

కొడవలూరు: రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని కలెక్టర్ ఎం.హరినారాయణన్ స్పష్టం చేశారు. కొడవలూరులోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, అందులో భాగంగానే స్పందన కార్యక్రమాన్ని మరింత మెరుగుపరిచి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చి వారి సమస్యలపై అధికారులకు వినతులు అందించేందుకు అవస్థలు పడుతున్న నేపథ్యంలో వారి ఇబ్బందులను తొలగిస్తూ మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. జిల్లాలో బుధ, శుక్ర వారాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో వచ్చిన అర్జీలను నేరుగా సీఎం కార్యాలయం పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన అన్ని సమస్యలు సచివాలయాల ద్వారా పరిష్కారమవుతున్నాయని తెలిపారు. కొడవలూరులో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో 75 వినతులు అందాయని, మండలంలో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే 1902 టోల్‌ఫ్రీ నంబరుకు తెలియజేసి సమస్యను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక బృహత్తర కార్యక్రమం 'జగనన్నకు చెబుదాం' అని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, ఆర్డీఓ శీనానాయక్, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, నుడా వీసీ బాపిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, తహసీల్దార్ ఇ.రమాదేవి, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు కామాక్షి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నెల్లూరు సాకారానికి కృషి



దుకాణాల ముందు నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

• కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛ నెల్లూరు సాకారానికి కృషి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా ఎస్పీ బంగ్లా, పొదలకూరు రోడ్డు, పద్మావతి సెంటర్, హౌసింగ్ బోర్డు కాలనీ, డైకస్ రోడ్డు, వేదాయపాళెం, అయ్యప్పగుడి తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. పలు వీధుల్లోని కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని, దోమల నిర్మూలనకు గానూ మురుగు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేసి, రీసైక్లింగ్ విధానానికి సహకరించాలని కోరారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీ

బాలాజీనగర్‌లోని 15 / 1, 2, 3, 16 / 1 వార్డు సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. ఇన్‌స్పెక్షన్, హాజరు రిజిస్టర్లు, నోటీస్ బోర్డు, స్పందన రిజిస్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల్లో ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కోరారు. అదనపు కమిషనర్ శర్మద తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

నెల్లూరు నగర నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాను నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వికాస్ మర్మత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాలను అన్ని పోలింగ్ స్టేషన్లతోపాటు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రదర్శించామని చెప్పారు. జాబితాను ఓటర్లు పరిశీలించి వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. తుది డ్రాఫ్ట్ రోల్‌ను జనవరి 5న ప్రకటించనున్నామని వెల్లడించారు. మార్పులు, చేర్పులు అవసరమైన వారు సంబంధిత బీఎల్వోలను సంప్రదించి సవరణలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని సూచించారు.

ప్రభుత్వ భూమి కబ్జా



చిత్రంలో కనిపిస్తున్న ప్రహరీ లోపలే ప్రభుత్వ పోరంబోకు భూమి ఉంది

నెల్లూరు రూరల్ పరిధిలో కొందరు ఆక్రమణదారులు బరితెగిస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన భూములపై కబ్జాదారులు కన్నేసి దురాక్రమణకు పాల్పడుతున్నారు. లేఅవుట్‌ల పక్కనే ఉన్న భూములను గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమించి లేఅవుట్లలో కలిపేసుకుంటున్నారు. టీడీపీ హయాంలో జరిగిన భూకబ్జా ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. గుడిపల్లిపాడు రెవెన్యూ పరిధిలోని కోడూరుపాడులో జరిగిన ఈ భూదందాపై జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమిస్తోంది.

- నెల్లూరు రూరల్ కోడూరుపాడులో 22.5 ఎకరాల దురాక్రమణ
- ఆక్రమణదారుడి చెరలో రూ.25 కోట్ల విలువైన పోరంబోకు భూములు
- అప్రూవల్ లేఅవుట్‌లో ప్రభుత్వ భూమిని కలిపేసుకున్న వైనం
- ఆక్రమిత భూమి చుట్టూ ప్రహరీ నిర్మాణం
- అంకణాల చొప్పున విక్రయాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు రూరల్ పరిధిలోని గుడిపల్లిపాడు రెవెన్యూ పరిధిలో ఉన్న కోడూరుపాడు ప్రాంతంలో లేఅవుట్ వేసిన విజయవాడకు చెందిన రియల్టర్ ప్రభుత్వ పోరంబోకు భూములను ఆక్రమించేశారు. వాస్తవంగా 22.5 ఎకరాల పట్టా భూమిలో నుడా అనుమతితో లేఅవుట్ వేశారు. ఆ భూమి పక్కనే ఉన్న ప్రభుత్వానికి చెందిన 22.5 ఎకరాల పోరంబోకు భూమిని ఆక్రమించేశారు. పట్టా భూమికి నుడా అనుమతి తీసుకుని, పక్కనున్న ప్రభుత్వ భూమిని కలుపుకుని ప్రహరీ నిర్మించారు. కోడూరుపాడు గ్రామ సమీపంలో వేసిన లేఅవుట్‌లో సర్వే నంబర్లు 521, 525, 527, 529–ఏ, 529–బీలలో మొత్తం 22.5 ఎకరాల ప్రభుత్వ, కాలువ పోరంబోకు భూములను కబ్జా చేశారు. అసలు స్థిరాస్తి వ్యాపారి వేసిన లేఅవుట్‌లోకి వెళ్లేందుకు మార్గం లేదు. దాన్ని కూడా ప్రభుత్వ భూమిలోనే వేశారు. దానిపై గతంలో స్థానికులు ఫిర్యాదు చేయడంతో పరిశీలించిన అధికారులు గతంలో బోర్డులు ఏర్పాటు చేశారు. తర్వాత వ్యాపారులు వాటిని తొలగించడంతో కొందరు గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. దీంతో మూడేళ్లుగా విక్రయాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం అక్రమార్కులు లేఅవుట్లలోని ప్లాట్లను అమ్మకానికి పెట్టారు. అంకణం ధర.రూ.90 వేలుగా నిర్ణయించారు. చుట్టూ ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమి గురించి ప్రస్తావించగా త్వరలో ఆ ప్రాంతం మొత్తం కమర్షియల్‌గా అభివృద్ధి చేస్తామని చెబుతుండడం గమనార్హం.

ఆక్రమణదారుల బరితెగింపు

నెల్లూరు రూరల్ మండలంలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోంది. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అక్కడ పనిచేసిన తహసీల్దార్లు, ఇన్‌చార్జి తహసీల్దార్‌లు ఇష్టానుసారం దస్త్రాలు మార్చేశారని, ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆన్‌లైన్‌లో ప్రైవేట్ వ్యక్తుల పేర్ల మీద మార్పులు చేశారని తెలుస్తోంది. దీంతో రెవెన్యూ రికార్డులు గందరగోళంగా మారాయి. రికార్డులు సరిలేనందున ప్రభుత్వ భూములను కబ్జాకోరులు ఆక్రమించుకుంటున్నారు. ఇదే అక్రమార్కులకు కొండంత ధైర్యంగా మారింది. ఎలాంటి భయం లేకుండా రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రభుత్వం సీరియస్

ప్రభుత్వ, దేవాలయ భూముల ఆక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పౌర సరఫరాల శాఖ కుంభకోణం, కలువాయి మండలంలో భూపరిహారం విషయంలో జరిగిన అక్రమాలను ఇప్పటికే వెలుగులోకి తెచ్చిన ప్రభుత్వం తాజాగా అప్పట్లో జరిగిన భూకబ్జాలపై చర్యలకు ఉపక్రమిస్తోంది. ఆక్రమణలకు గురైన ఖరీదైన భూములను గుర్తిస్తోంది. తాజాగా గుడిపల్లిపాడు రెవెన్యూ పరిధిలో ఆక్రమిత భూములకు సంబంధించి చర్యలు చేపట్టేందుకు కలెక్టర్ ఎం.హరినారాయన్ పరిశీలిస్తున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆక్రమిత భూములను గుర్తించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వెంచర్ చుట్టూ నిర్మించిన ప్రహరీ

అనుమతులు లేకుండానే మైన్స్ పరిశీలన

• సైదాపురం మండలంలో టీడీపీ బృందం హడావుడి

సైదాపురం: మైకా గనులను పరిశీలించే ముందుగా సంబంధిత మైనింగ్ ఉన్నతాధికారుల అనుమతులు తప్పనిసరి. అవేవీ లేకుండానే హడావుడిగా అక్రమాలు జరిగాయంటూ జిల్లాకు చెందిన టీడీపీ నేతలు ఓ బృందంగా ఏర్పడి సైదాపురం మండలంలోని మైనింగ్ ప్రాంతాన్ని సందర్శించారు. శుక్రవారం మండలంలోని తుమ్మలతలుపూరు గ్రామంలోని జయలక్ష్మి మైకా మైన్ ప్రాంతాన్ని టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. గని ఉన్న ప్రాంతాన్ని పరిశీలించే క్రమంలో జిల్లా మైనింగ్ అధికారి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అలాగే ఆయనతోపాటు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ సేఫ్టీ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. కానీ టీడీపీ నేతలు ఆ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే మైనింగ్‌ను పరిశీలించి అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేయడం విస్మయానికి గురిచేస్తోంది.

వైద్యుల రక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలి

• ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ

కావలి: రాష్ట్రంలో వైద్యుల రక్షణకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకొచ్చిన చట్టాన్ని పటిష్టంగా అమలు జరిగేలా చేయాలని ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ కోరారు. శుక్రవారం కావలిలోని ఐఎంఏ శాఖ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల దేశవ్యాప్తంగా ఆస్పత్రులు, వైద్యులపై భౌతిక దాడులు పెరుగుతున్నాయని, వాటిని నివారించి వైద్యులు తమ వైద్యసేవలు నిర్భయంగా, స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో దేశంలోనే మొట్టమొదటిసారిగా వైద్యులపై, ఆస్పత్రులపై దాడుల నిరోధానికి చట్టం తీసుకువచ్చారని, ఆ తర్వాత 16 రాష్ట్రాల్లో ఇదే విధమైన చట్టాన్ని అమలు చేశారని గుర్తుచేశారు.

ఆరోగ్యశ్రీ పథకం అమలు ప్రశంసనీయం

రాష్ట్రంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తూ, ఆరోగ్యశ్రీ పరిధిని మరింత విస్తృతం చేసి అన్నిరకాల జబ్బులను ఇందులో చేర్చడం, కోలుకునే సమయంలో ఆర్థికసాయం ఇవ్వడం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు అత్యున్నత స్థాయి వైద్యం అందిస్తున్నందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఏ శాఖ తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఆరోగ్యశ్రీ నిధులు సకాలంలో మంజూరు చేస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కావలి ఐఎంఏ శాఖ అధ్యక్షుడు డాక్టర్ బి.సతీష్, కార్యదర్శి డాక్టర్ శ్రీధర్, సీనియర్ వైద్యులు డాక్టర్ శ్రీరాం మనోహర్‌బాబు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ గోపి, డాక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్కూటర్‌ను ఢీకొన్న సెబ్ వాహనం

ఆత్మకూరు రూరల్: ఆగి ఉన్న బైక్‌ను ఆత్మకూరు సెబ్ కార్యాలయానికి చెందిన వాహనం ఢీకొన్న ఘటన పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ప్రమాదానికి గురైన బైక్‌ను సోమశిల రోడ్డు కూడలిలోని ఓ బేకరీ యజమానిదిగా గుర్తించారు. ఘటనలో బైక్‌తో పాటు సెబ్ వాహన ముందు భాగం దెబ్బతినింది. ఈ క్రమంలో నష్టపరిహారాన్ని వసూలు చేసేందుకు సెబ్ వాహన డ్రైవర్‌ను రోజంతా తమ కార్యాలయంలోనే నిర్బంధించారనే వార్తలొచ్చాయి. చివరికి డ్రైవర్‌ను ఆ శాఖ అధికారులు విడిచిపెట్టారని సమాచారం. ఈ అంశమై ఆత్మకూరు సెబ్ సీఐ నయనతారను సంప్రదించగా, వాహనాన్ని కాంట్రాక్ట్ ప్రాతిపదికన వినియోగిస్తున్నామని.. ఆత్మకూరు సమీపంలోని నువ్వూరుపాడుకు విధి నిర్వహణ నిమిత్తం వెళ్లి తమ సిబ్బంది తిరిగొస్తుండగా ఘటన జరిగిందని, పోలీస్ కేసును నమోదు చేయలేదని బదులిచ్చారు.

యువకుడి మృతదేహం లభ్యం



కందుకూరు: పట్టణంలోని టీఆర్‌ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో యువకుడి మృతదేహం లభ్యమైంది. ఎస్సై హనీఫ్ వివరాల మేరకు.. గుడ్లూరు మండలం చెమిడిదిపాడుకు చెందిన ప్రభాకర్‌రావు కుమారుడు సుధీర్ (31) రెండు రోజుల క్రితం తన పెదనాన్న ఏసోబు దశదిన కర్మకు హాజరయ్యేందుకు కందుకూరు వచ్చారు. అనంతరం శుక్రవారం ఉదయం కనిపించకుండా పోయారు. ఈ క్రమంలో టీఆర్‌ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో యువకుడు పడిపోయి ఉన్న అంశాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడ్ని పరిశీలించి, అప్పటికే మృతి చెందారని గుర్తించారు. యువకుడి వివరాలను ఆరాతీసి బంధువులకు సమాచారం అందించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి ఫిట్స్ సమస్యతో పాటు అతిగా మద్యం సేవించే అలవాటు ఉందని బంధువుల ద్వారా తెలిసిందని ఎస్సై తెలిపారు.

అమీర్ ఆర్ట్స్ అకాడమీకి అవార్డు

నెల్లూరు(బృందావనం): నగరంలోని టెక్కేమిట్టలో తాను నిర్వహిస్తున్న అమీర్ ఆర్ట్స్ అకాడమీ ఒంగోలు సృష్టి ఆర్ట్స్ అకాడమీ ఆర్ట్స్ గెలాక్సీ అవార్డుకు ఎంపికైందని చిత్రకారుడు అమీర్‌జాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించనున్న కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నానని చెప్పారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం



చాటగొట్ల - బిరదవోలు రోడ్డును ప్రారంభిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని, ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో సవివరంగా తెలియజేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చాటగొట్ల - బిరదవోలు మధ్య రూ.2.6 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును శుక్రవారం ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు రమ్మంటే ప్రతిసారి సోమిరెడ్డి పలాయనం చిత్తగిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గం ఏర్పడ్డాక ఎంత అభివృద్ధి జరిగింది.. తాను ఎమ్మెల్యేగా.. మంత్రిగా ఐదేళ్లలో ఏ మేరకు అభివృద్ధి చేశానో వెల్లడిస్తానని చెప్పారు. చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి పనులను చేపట్టామని, ఎక్కడా మట్టి రోడ్డు లేకుండా సీసీ రోడ్లను నిర్మించామని వివరించారు. సోమిరెడ్డి ఉడత బెదిరింపులకు బెదిరేది లేదని.. కడుపు మంటతో అభివృద్ధిని అడ్డుకోవాలని ఆయన యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, అభివృద్ధి జరిగితే తనకెక్కడ పేరొస్తుందోనని న్యాయస్థానాలకు సైతం ఆశ్రయిస్తున్నారని తెలిపారు. పేదలు సాగుచేసుకుంటున్న భూములను పట్టాలుగా మార్చి వారికే అందజేయనున్నామని స్పష్టం చేశారు. చాటగొట్ల - బిరదవోలు రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో జీఓను తీసుకొచ్చినా, టెండర్లు పిలవొద్దని అధికారులకు సోమిరెడ్డి హుకుం జారీ చేశారని విమర్శించారు. టీడీపీ హయాంలో అభివృద్ధి కాగితాలకే పరిమితమైందని మండిపడ్డారు. తహసీల్దార్ వీరవసంతరావు, ఎంపీడీఓ నగేష్‌కుమారి, పీఆర్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ మవేక్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఎంపీటీసీ రావుల దశరథరామయ్యగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నేతలు వెన్నపూస దయాకర్‌రెడ్డి, రావుల ఇంద్రసేన్‌గౌడ్, అక్కెం బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదల సంక్షేమం



జెడ్పీ ఉన్నత పాఠశాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం సాధ్యమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలో శుక్రవారం నిర్వహించిన పలు కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. జువ్వలదిన్నెలో నాడు - నేడు ద్వారా రూ.1.6 కోట్లతో జెడ్పీ ఉన్నత పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాతబిట్రగుంటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. నాడు - నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు కర్తం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్సీపీని ఆదరించండి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. 25వ డివిజన్లోని బుజబుజనెల్లూరులో రూ.80 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనను శుక్రవారం ఆయన నిర్వహించారు. మెప్మా ఆధ్వర్యంలో పొదుపు సమాఖ్య సంఘాల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక డివిజన్ పరిధిలోని ప్రాంతాల్లో అభివృద్ధి పనులను భారీగా చేపట్టామని, మరో రూ.రెండు కోట్ల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.150 కోట్లను ఎనిమిది నెలల్లో ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. పలు పనులను పూర్తి చేయగా, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని చెప్పారు. ఈ ప్రాంతంలో మహిళా భవన నిర్మాణానికి నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని.. నియోజకవర్గం నుంచి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనంతరం డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గంలో నియంత పాలన గతంలో ఉండేదని.. ప్రస్తుతం ఎంతో ప్రశాంతంగా ఉందని చెప్పారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, మెప్మా పీడీ రవీంద్ర, పార్టీ డివిజన్ ఇన్‌చార్జి నవాబ్‌జాన్, మాజీ ఎంపీటీసీ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

డయాగ్నొస్టిక్స్ సెంటర్ ప్రారంభం



ప్రారంభిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలో ఏర్పాటు చేసిన వైఆర్జీ కేర్ డయాగ్నొస్టిక్స్ సెంటర్‌ను ఎమ్మెల్సీ, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డయాగ్నొస్టిక్స్ సెంటర్ ద్వారా అత్యాధునిక పరికరాలతో క్వాలిఫైడ్ సిబ్బందితో అన్ని రకాల రక్త పరీక్షలను తక్కువ ధరలకే చేయనున్నామని వివరించారు. రానున్న రోజుల్లో వైద్య సేవలనూ అందించనున్నామని తెలిపారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ సుధీర్‌నాయుడు, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, సురేష్‌కుమార్ జైన్, శ్రీహరిరెడ్డి, కన్వీనర్లు రవీంద్రరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.





నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ : రూ.130
లేయర్ : రూ.110
బ్రాయిలర్ చికెన్: రూ.226
స్కిన్‌లెస్ చికెన్: రూ.250
లేయర్ చికెన్: రూ.187

నిమ్మ ధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి : రూ. 50
సన్నవి : రూ. 15
పండు : రూ. 5



ఏళ్ల కల సాకారం



పట్టాలను అందుకున్న లబ్ధిదారులతో ప్రసన్నకుమార్‌రెడ్డి

- లేబూరు వాసులకు పట్టాల పంపిణీ
- ఎమ్మెల్యే ప్రసన్నకు కృతజ్ఞతలు

ఇందుకూరుపేట: లేబూరుకు చెందిన నిరుపేదల కల ఎట్టకేలకు సాకారమైంది. కూలీ నాలీ చేసుకొని జీవనం సాగించే నిరుపేదలు గ్రామంలో పొలాలకు వెళ్లే డొంక పక్కన పోరంబోకు స్థలంలో గుడిసెలు వేసుకొని కాలం వెళ్లదీస్తూ వచ్చారు. కొంత కాలం క్రితం ప్రభుత్వం సాయం.. కష్టపడి సంపాదించిన నగుదుతో ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ క్రమంలో పట్టాలను అందజేయాలని పలువుర్ని కోరినా ప్రయోజనం లభించలేదు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి తమ సమస్యను తెలియజేశారు. ఈ క్రమంలో వీరికి పట్టాలను త్వరితగతిన అందజేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో 21 మంది లబ్ధిదారులకు పట్టాలను అధికారులు సిద్ధం చేశారు. సోమరాజుపల్లిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఈ పట్టాలను వీరికి అందజేశారు. ఎమ్మెల్యేకు ఎప్పటికీ రుణపడి ఉంటామని లబ్ధిదారులు పేర్కొన్నారు. అనంతరం యాబీకండ్రిగకు చెందిన 14 మందికి జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు, నేతలు పరిగొండ బాబయ్య, శ్రీహరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో స్నేహితుడ్ని కిరాతకంగా హత్య చేసిన ఘటనలో నిందితులను నవాబుపేట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. నగరంలోని సత్యనారాయణపురానికి చెందిన మహీధర్ (28), వైకుంఠపురానికి చెందిన ప్రశాంత్, రామ్‌చరణ్ అలియాస్ బుగ్గా స్నేహితులు. వినాయక నిమజ్జనం సందర్భంగా వీరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీన్ని మనస్సులో పెట్టుకున్న ప్రశాంత్, రామ్‌చరణ్ తమ స్నేహితుడ్ని అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో సత్యనారాయణపురంలో ఈనెల 19న వీరు పూటుగా మద్యం సేవించారు. మద్యం మత్తులో వీరి మధ్య మాటామాటా పెరిగింది. ఆగ్రహానికి గురైన ప్రశాంత్, రామ్‌చరణ్ తమ స్నేహితుడు మహీధర్‌ను దారుణంగా హత్య చేసి పరారయ్యారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బాబీ నేతృత్వంలో ఎస్సైలు శివప్రకాష్, రెహమాన్ తమ సిబ్బందితో కలిసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎఫ్‌సీఐ కాలనీ వద్ద నిందితులు ప్రశాంత్, రామ్‌చరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, సిబ్బంది వెంకటేశ్వర్లు, సురేంద్రబాబు, రత్నం, మోహన్‌బాబు, వేణు, వెంకటేశ్వర్లును డీఎస్పీ అభినందించారు.